సాక్షి
అనంతపురం
శనివారం। 21। సెప్టెంబర్। 2024



చీనీ టన్ను రూ.19,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠ ధర రూ.19,500 పలికాయి.



అదుపులో బెట్టింగ్‌రాయుళ్లు

దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లు వీక్షిస్తూ బెట్టింగ్‌కు పాల్పడిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
36.6°/22.8°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

యువత 'మత్తు'కు బానిస కారాదు



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో ఎస్పీ జగదీష్

అనంతపురం అర్బన్: యువత మత్తు, మాదక ద్రవ్యాలకు బానిస కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ పి.జగదీష్‌తో కలిసి నార్కో కో-ఆర్డినేషన్ కమిటీ జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ యువత మత్తుకు బానిసైతే భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. మాదకద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై బస్టాండులు, రైల్వే స్టేషన్లు, జనసంచారం ఉండే కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. మందుల దుకాణాల్లో వైద్యుని ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మాత్రలు ఇవ్వకుండా చూడాలన్నారు. ప్రతి మెడికల్ స్టోర్‌లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు గంజాయి, తదితర మాదక ద్రవ్యాలు రవాణా కాకుండా గట్టి నిఘా ఉంచాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

హౌరా ఎక్స్‌ప్రెస్ యశ్వంతపుర వరకు పొడిగింపు

- 25 నుంచి అందుబాటులోకి



హౌరా-పుట్టపర్తి రైలు

అనంతపురం సిటీ: ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న హౌరా ఎక్స్‌ప్రెస్ రైలు యశ్వంతపుర వరకు పొడిగించారు. ఈ నెల 25 నుంచి పొడిగింపు అమలులోకి వస్తుందని ఉత్తర్వులు జారీ చేశారు. హౌరా నుంచి పుట్టపర్తి (శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం) వయా అనంతపురం, గుత్తి, మార్కాపురం, విజయవాడ మీదుగా నడిచే ఈ రైలు (నంబర్: 22831)ను యశ్వంతపుర వరకు పొడిగించారు. యశ్వంతపుర నుంచి తిరిగి అదే రూటులో నడిచే రైలు (నంబర్: 22832) యశ్వంతపురలో తెల్లవారుజామున 5 గంటలకు బయలుదేరుతుందని అనంతపురం రైల్వే స్టేషన్ మేనేజర్ మాసినేని అశోక్‌కుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రయాణికులను ఆయన కోరారు.

ముందుకు కదలని గూడ్స్ రైలు వీల్స్

- ఆలస్యంగా నడిచిన పూణే ఎక్స్‌ప్రెస్



ఇంజిన్‌కు మరో ఇంజిన్‌ను జత చేస్తున్న సిబ్బంది

గుంతకల్లు: రైల్వే జంక్షన్ సమీపంలోని సౌత్ క్యాబిన్ వద్ద గూడ్స్ రైలు వీల్స్ ముందుకు కదలక నిలిచిపోయింది. దీంతో పూణే ఎక్స్‌ప్రెస్ రైలు గంటన్నరకు పైగా ఆలస్యంగా నడిచింది. వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటకలోని రాయచూర్ సమీపాన ఓ ఫ్యాక్టరీకి బొగ్గు లోడ్‌తో వస్తున్న గూడ్స్ రైలు శుక్రవారం గుంతకల్లు జంక్షన్‌లోని సౌత్ క్యాబిన్ వద్ద లూప్‌లైన్‌లోకి మళ్లించారు. అయితే రైలు మార్గం పనుల్లో భాగంగా ఈ ప్రాంతంలో రైలు కమ్మీలకు గ్రీస్ పూశారు. ఈ గ్రీస్ గూడ్స్ రైలు వీల్స్‌కు అంటుకుంది. దీనికి తోడు అధిక లోడింగ్ కారణంగా వీల్స్ స్ట్రక్ అయ్యి రివర్స్‌కు తిరగడంతో లోకో పైలట్ వెంటనే రైలు నిలిపివేశాడు. దీంతో గూడ్స్ రైలు గుంతకల్లు-గుత్తి రైలు మార్గంలో నిలిచిపోయింది. అదే సమయంలో కన్యాకుమారి- పూణే (16832) ఎక్స్‌ప్రెస్ రైలు గుంతకల్లు రైల్వేస్టేషన్ రావాల్సి ఉండగా తిమ్మనచెర్ల రైల్వేస్టేషన్‌లో నిలిపివేశారు. అప్రమత్తమైన అధికారులు వెంటనే మరో రైలింజన్‌ను ఈ గూడ్స్‌రైలు అటాచ్ చేయడంతోపాటు గూడ్స్‌రైలు వీల్స్ పూసుకున్న గ్రీస్‌ను శుభ్రం చేశారు. మరో ఇంజిన్ అటాచ్ చేసి గూడ్స్ రైలును ముందుకు కదిలించారు. తిమ్మనచెర్ల రైల్వేస్టేషన్‌కు 9.45 గంటలకు చేరుకున్న పూణే ఎక్స్‌ప్రెస్ 11.15 గంటలకు జంక్షన్‌లోకి ప్రవేశించింది.

జిల్లా యంత్రాంగాన్ని శాసించేది... పాలించేది రెవెన్యూ శాఖ. అలాంటి ప్రధాన శాఖలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు రాజకీయ నేతల పంచన చేరి... తమ అస్థిత్వానికి మచ్చ తెచ్చుకుంటూ శాఖ గౌరవాన్ని తగ్గిస్తున్నారు. బదిలీల విషయంలో ఈ పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. కోరుకున్న స్థానాల్లో పోస్టింగ్ కోసం ప్రజాప్రతినిధులు ఇళ్ల వద్దకు వెళ్లి సిఫారసు చేయించుకుంటున్నారు. పోస్టింగ్ పొందిన తరువాత... సిఫారసు అనే గొలుసును మెడలో వేసుకుని దానిని ప్రజాప్రతినిధుల చేతికి అప్పగించి... వారు ఆడించినట్టు ఆడే పరిస్థితిని 'కొని' తెచ్చుకుంటున్నారనే అభిప్రాయం ఆ శాఖ వర్గాల నుంచే వ్యక్తమవుతుండడం గమనార్హం.



రాజకీయ పంచన రెవెన్యూ

- రేపటితో ముగియనున్న రెవెన్యూ బదిలీల ప్రక్రియ
- కోరుకున్న చోటుకు పోస్టింగ్ కోసం డీటీలు, వీఆర్‌ఓల పైరవీలు
- సిఫారసు లేఖల కోసం ప్రజాప్రతినిధుల వద్దకు క్యూ

అనంతపురం అర్బన్: సాధారణ బదిలీల ప్రక్రియ పూర్తికి ఈ నెల 22 వరకు ప్రభుత్వం గడువు ఇచ్చింది. దీంతో రెవెన్యూ శాఖ కసరత్తు చేపట్టింది. ప్రధానంగా ఈ శాఖలో క్షేత్రస్థాయి ఉద్యోగుల్లో క్రియాశీలకంగా ఉండేది డీటీలు (డిప్యూటీ తహసీల్దార్లు), వీఆర్‌ఓలు (గ్రామ రెవెన్యూ అధికారులు). జిల్లాలో డిప్యూటీ తహసీల్దార్లు 55, రీసర్వే డీటీలు 32, ఈడీటీ (ఎన్నికల) ఎనిమిది, సీఎస్‌డీటీలు 48.. మొత్తం 143 పోస్టులు ఉన్నాయి. ఇందులో 126 మంది డీటీలు పనిచేస్తుండగా.. 17 ఖాళీలు ఉన్నాయి. ఇక వీఆర్‌ఓల విషయానికి వస్తే జిల్లాలో 335 పోస్టులు ఉన్నాయి. ఇందులో 277 మంది పనిచేస్తుండగా 58 ఖాళీలు ఉన్నాయి.

బదిలీకి సిఫారసు లేఖలు

- ప్రస్తుతం పనిచేస్తున్న 126 మంది డీటీల్లో ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారు 13 మంది, రీసర్వే డీటీలు ఇద్దరు మొత్తం 15 మంది ఉన్నారు. ఇక బదిలీ కోసం 46 మంది డీటీలు, 21 మంది రీసర్వే డీటీలు మొత్తం 67 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇలా బదిలీల ప్రక్రియలో 82 మంది నిలిచారు. కోరుకున్న చోట పోస్టింగ్ కోసం ప్రజాప్రతినిధుల నుంచి 23 మంది సిఫారసు లేఖ తెచ్చుకున్నట్లు సమాచారం.
- ప్రస్తుతం పనిచేస్తున్న 277 మంది వీఆర్‌ఓలలో ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నవారు 58 మంది ఉన్నారు. బదిలీ కోసం 189 మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో బదిలీ ప్రక్రియలో 247 మంది నిలిచారు. కోరుకున్న చోట పోస్టింగ్ కోసం ప్రజాప్రతినిధుల నుంచి 165 మంది వీఆర్‌ఓలు సిఫారసు లేఖ తెచ్చుకున్నట్లు సమాచారం.

అనుకూలమైన చోటు కోసం...

రెవెన్యూ శాఖలో డీటీలు, వీఆర్‌ఓలు తాము పనిచేస్తున్న చోట నుంచి మరొకచోటుకు బదిలీ కాకుండా.. దూరంగా వెళ్లకుండా అక్కడక్కడే విధుల్లో కొనసాగేలా విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. తమకు అనుకూలంగా ఉన్న ప్రాంతాలను వీడటానికి ఏమాత్రమూ ఇష్టపడటం లేదు. ఎలాగైనా తమకు ఎక్కడ అనుకూలంగా ఉందో అక్కడకు బదిలీ చేయించుకునేందుకు ప్రజాప్రతినిధుల నుంచి సిఫారసు లేఖల కోసం పోటీపడుతున్నారు.

నేడు వీఆర్‌ఓలకు బదిలీ కౌన్సెలింగ్

బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న గ్రేడ్-2 వీఆర్‌ఓలకు శనివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌కు తమ సర్టిఫికెట్లు, సంబంధిత డాక్యుమెంట్లతో హాజరవ్వాలని తెలిపారు.

> **పారదర్శకంగా బదిలీల ప్రక్రియ**
>
> 
>
> రెవెన్యూ శాఖలో బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకున్నాం. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఎక్కడా పొరపాట్లకు ఆస్కారం లేకుండా జాబితా సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చాం. సిఫారసు లేఖలు వస్తుంటాయి. అయితే బదిలీలకు సంబంధించి ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటిస్తాం. ఉద్యోగి సీనియార్టీ, వారి ఇచ్చిన ఆప్షన్ల ప్రకారం బదిలీలు ఉంటాయి.
>
> – వి.వినోద్‌కుమార్, కలెక్టర్

సిఫారసు లేఖలకే ప్రాధాన్యత

- ఇదీ ఉమ్మడి జిల్లాలోని సచివాలయ ఉద్యోగుల బదిలీల తీరు



బదిలీలను పర్యవేక్షిస్తున్న మునిసిపల్ ఆర్డీ విశ్వనాథ్, నగరపాలక సంస్థ కమిషనర్ నాగరాజు

అనంతపురం కార్పొరేషన్: సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో సిఫారసు లేఖలు కీలకంగా మారాయి. మంత్రి, ఎమ్మెల్యేల సిఫారసు లేఖలకే అధికారులు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి. శుక్రవారం నగరపాలక సంస్థలో ఉమ్మడి జిల్లాలోని నగరపాలక సంస్థ, 9 మునిసిపాలిటీల్లో వార్డు అడ్మిన్, ఎడ్యుకేషన్, వెల్ఫేర్, శానిటేషన్, ప్లానింగ్, అమినిటీస్ తదితర 256 పోస్టుల భర్తీకి సంబంధించి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌ను మునిసిపల్ ఆర్డీ విశ్వనాథ్, నగరపాలక సంస్థ కమిషనర్ నాగరాజు పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా బదిలీల్లో ఉద్యోగుల నుంచి అధికారులు ఆప్షన్స్ తీసుకున్నారు. ఎమ్మెల్యేల లేఖలున్న వారిని పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే శుక్రవారం అందించాల్సిన ఉత్తర్వులను శనివారానికి వాయిదా వేశారు. వాస్తవంగా మ్యూచువల్, స్పౌస్, మెడికల్ గ్రౌండ్స్ కింద కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. ఇదే విషయమై మునిసిపల్ ఆర్డీ విశ్వనాథ్‌ను వివరణ కోరగా అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ కింద మంత్రి, ఎమ్మెల్యే, ఎవరు లేఖలిచ్చినా వాటిని పరిశీలించి, నిబంధనల మేరకే బదిలీలు చేపడతామన్నారు. బదిలీలు పారదర్శకంగా చేపట్టేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. శనివారం బదిలీ ఉత్తర్వులను అందజేయనున్నట్లు చెప్పారు.

ఒత్తిళ్ల మధ్య ఈ-క్రాప్

- బూతులతో రెచ్చిపోతున్న తెలుగు తమ్ముళ్లు
- అధికారులు.. ప్రజాప్రతినిధులకు చెప్పుకోలేక సిబ్బంది సతమతం
- సర్వర్ సతాయింపులు, ఒత్తిళ్ల మధ్య రాత్రింబవళ్లు పంట నమోదు



ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ, ఏఓలు



ఆత్మకూరు మండలం సిద్ధరాంపురంలో రాత్రి 9 గంటల సమయంలో ఈ-కేవైసీ అగచాట్లు

అనంతపురం అగ్రికల్చర్: అధికార తెలుగుదేశం పార్టీ 'తమ్ముళ్లు' తమ ప్రతాపాన్ని రైతు సేవా కేంద్రాల (ఆర్‌ఎస్‌కే) సిబ్బందిపై చూపిస్తున్నారు. ఆడ, మగ అనే తేడా లేకుండా కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారు. గ్రామస్థాయిలో రైతులకు సేవలందిస్తున్నారనే గౌరవం, కనికరం, ఇంగితజ్ఞానం లేకుండా తీవ్ర ఒత్తిళ్లకు గురిచేస్తున్నట్లు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఖరీఫ్ పంట నమోదుకు సంబంధించి ఈ-క్రాప్, ఈ-కేవైసీ ప్రక్రియ కొనసాగుతుండగా, అలాగే 80 శాతం సబ్సిడీతో ఉలవ, పెసర, అలసంద, మినుము, కొర్ర, సజ్జ లాంటి ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ కొనసాగిస్తున్నారు.

సిబ్బందిపై బండబూతులు

తమ ప్రభుత్వం అధికారంలో ఉంది.. పంట వేయకున్నా తమ పొలాలు, పేర్లు ఈ-క్రాప్‌లోకి ఎక్కించాలని, తాము చెప్పిన పంటనే నమోదు చేయాలని ఆర్‌ఎస్‌కే సిబ్బందికి టీడీపీ నేతలు హుకుం జారీ చేస్తున్నారు. కక్ష సాధింపు చర్యల్లో 'వైఎస్సార్‌సీపీ' ముద్ర వేసి కొందరు రైతుల పంట పొలాలు ఈ-క్రాప్ చేయకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టీడీపీ చోటామోటా నేతలు తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు తెస్తున్నట్లు చెబుతున్నారు. చెప్పిన మాట వింటే ఓకే... లేదంటే బెదిరించడం, ఆడ, మగా తేడా లేకుండా దుర్భాషలాడుతున్నారని చాలామంది బయటకు చెప్పుకోలేక మదనపడుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా పరిగి మండలం శాసనకోట ఆర్‌ఎస్‌కే సిబ్బందిపై ఆదే గ్రామానికి చెందిన టీడీపీ నేత ఫోన్‌లో రాయలేని పదజాలంతో పదే పదే దూషించిన విషయం తెలిసిందే.

సర్వర్ సతాయింపు

ఈ-క్రాప్, ఈ-కేవైసీ ప్రక్రియ చాలా పథకాలకు కొలమానం కావడంతో దీనికి అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ నెల 23న తుది గడువు. సమయం తక్కువగా ఇచ్చి ప్రతి పొలం, ప్రతి రైతు వివరాలు నమోదు చేయడానికి చాలా ఇబ్బందిగా ఉందని సిబ్బంది చెబుతున్నారు. తరచూ సర్వర్ మొరాయించడం, అవగాహన లేని రైతులు సమయానికి ఓటీపీ చెప్పలేని పరిస్థితి ఉండటం, గడువులోపు పూర్తి కావాలని రోజుకు నాలుగైదుసార్లు పైఅధికారులు ఫోన్లలో హెచ్చరిస్తుండటంతో తమ పరిస్థితి ఘోరంగా ఉందని పలువురు ఆర్‌ఎస్‌కే సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వర్ సమస్య, ఇతరత్రా సాంకేతిక సమస్యల పరిష్కారానికి పై అధికారులు చొరవ చూపకపోవడంతో కుటుంబాన్ని పట్టించుకోకుండా రాత్రింబవళ్లు పని చేయాల్సి వస్తోందని చెబుతున్నారు. 100 శాతం ఈ-క్రాప్ పూర్తి కాగా... 60 శాతం వరకు ఈ-కేవైసీ పూర్తయినట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

గత ప్రభుత్వ హయాంలో సాఫీగా ఈ-ప్రక్రియ

ఈ కార్యక్రమాన్ని గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ఒకటి అరా మినహా చాలా సాఫీగా విజయవంతంగా కొనసాగించారు. సాగు చేసిన ప్రతి పంటనూ ఈ-క్రాప్, ఈ-కేవైసీ చేసి అర్హత కలిగిన ప్రతి రైతుకూ ఇన్‌పుట్‌సబ్సిడీ (పెట్టుబడిరాయితీ), ఇన్సూరెన్స్ (ఉచిత పంటల బీమా పరిహారం), ఎంఎస్‌పీ అమ్మకాలు, సున్నా వడ్డీ పంట రుణాలు తదితర ప్రభుత్వ ప్రయోజనాలు దక్కేలా చూశారు. ఎక్కడా పార్టీ ముద్ర లేకుండా రైతులంతా ఒక్కటే అనే భావనతో పనిచేశామని సిబ్బంది చెబుతున్నారు.

శిశువును విక్రయించిన తల్లి!

- ఆరోగ్య సిబ్బంది తనిఖీతో వెలుగులోకి
- ఎట్టకేలకు శిశువును స్వాధీనం చేసుకున్న అధికారులు



ఆస్పత్రిలో రూపను విచారణ చేస్తున్న సీడీపీఓ పద్మావతి, సీడబ్ల్యూసీ కోఆర్డినేటర్లు

రాయదుర్గంటౌన్: అమ్మ పొత్తిళ్లలో ఉండాల్సిన శిశువు ఆరోగ్య సిబ్బంది గృహసందర్శన సమయంలో కనిపించలేదు. కుటుంబ సభ్యుల ఆదరణ లేకపోవడంతో శిశువును అమ్మేసినట్లు విచారణలో తేలింది. ఈ సంఘటన రాయదుర్గంలో వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. గుమ్మఘట్ట మండలం నేత్రపల్లికి చెందిన రూప రాయదుర్గంలోని ఫిల్టరేషన్ వాటర్ ట్యాంకు సమీపంలో ఒంటరిగా నివాసముంటోంది. కుటుంబ సభ్యుల నిరాదరణకు గురైంది. కాగా ఈమె గత నెల 28న అనంతపురం ఆస్పత్రిలో మగబిడ్డకు జన్మనిచ్చింది. క్షేత్రస్థాయి ఆరోగ్య పరీక్షల్లో భాగంగా సచివాలయ హెల్త్ అసిస్టెంట్ సరోజ, ఆశా కార్యకర్త ఈ నెల 18న ఇంటిని సందర్శించినపుడు శిశువు కనిపించలేదు. అప్పటికే స్థానికంగా ఉన్న రాజు అనే వ్యక్తికి శిశువును అమ్మేసినట్లు స్థానికుల ద్వారా తెలిసింది. ఇదే విషయమై రూపను ప్రశ్నిస్తే డొంక తిరుగుడు సమాధానాలు చెబుతూ రెండు రోజుల పాటు కాలయాపన చేసింది. దీంతో ఆరోగ్య సిబ్బంది పోలీసులు, ఐసీడీఎస్ అధికారులతో పాటు సీడబ్ల్యూసీ వారికి ఫిర్యాదు చేశారు. శుక్రవారం రంగంలోకి దిగిన పోలీసులు, ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి, సీడబ్ల్యూసీ కోఆర్డినేటర్లు ఆమెను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేస్తే అసలు విషయం ఒప్పుకుంది. అయితే తాను శిశువును విక్రయించలేదని, స్థానికంగా ఉంటున్న వ్యక్తికి పెంచుకునేందుకు ఇచ్చానని చెప్పింది. అటు నుంచి రాజు ఇంటికి వెళ్లి విచారిస్తే మొదట్లో ఒప్పుకోలేదు. గట్టిగా హెచ్చరిస్తే ఎట్టకేలకు శిశువును తీసుకొచ్చి అధికారులకు అప్పగించాడు.

నేడు రూపకు కౌన్సెలింగ్

ప్రస్తుతం రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో శిశువును ఉంచి వైద్య సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. శనివారం కౌన్సెలింగ్ నిమిత్తం తల్లితో పాటు శిశువును అనంతపురం బాలల సంక్షేమ సమితికి అప్పగిస్తామని సీడీపీఓ పద్మావతి తెలిపారు. అయితే రూప తన కుమారుడిని సక్రమంగా చూసుకుంటుందనే నమ్మకం లేకపోవడం, కుటుంబ సభ్యుల సహకారం కూడా లేకపోవడంతో ఆమెను కౌన్సెలింగ్‌కు పంపుతున్నట్లు చెప్పారు.

అభివృద్ధిలో వెనక్కు.. అవినీతిలో ముందుకు

- సూపర్ సిక్స్ పథకాల అమలేదీ?
- ఇంతవరకూ బడ్జెట్ ప్రవేశపెట్టని వైనం
- రబీ సమీపిస్తున్నా రైతులకు అందని సాయం
- వంద రోజుల పాలనపై 'అనంత' ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రం అభివృద్ధిలో ఆరడుగులు వెనక్కు.. అవినీతిలో మూడడుగులు ముందుకు వెళ్లిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం అనంతపురంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి వంద రోజుల పాలనను దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం ఏం చేసిందో ప్రజలకు చెప్పకుండా అబద్ధాలు ప్రచారం చేస్తోందన్నారు. ఖరీఫ్ ముగిసి రబీ ప్రారంభమవుతున్నా రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వలేదన్నారు. వంద రోజుల్లో ఒక్క హామీనైనా నెరవేర్చారా అని ప్రశ్నించారు.

బడ్జెట్ ప్రవేశపెట్టని చేతగాని ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినపుడు ప్రభుత్వ ఖజానాలో రూ.100 కోట్లు మాత్రమే ఉన్నాయని, హామీలు ఎలా నెరవేర్చుతారని ఈనాడులో 2019 మే 30న ప్రచురించారని అనంత గుర్తు చేశారు. ఖజానాలో డబ్బు లేకున్నా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హామీలన్నీ నెరవేర్చడానికి అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టి రూ.2.27 లక్షల కోట్లు కేటాయించారని తెలిపారు. చెప్పినవిధంగా హామీలన్నీ నెరవేర్చారన్నారు. ప్రస్తుతం ఖజానాలో రూ.7 వేల కోట్లు ఉంటే కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో బడ్జెట్ ఎందుకు ప్రవేశపెట్టలేదని నిలదీశారు. ఏ రాష్ట్రం కూడా ఈ విధంగా బడ్జెట్‌ను నిర్లక్ష్యం చేయలేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలకు ఎక్కడ కేటాయింపులు చేయాల్సి వస్తుందోనని బడ్జెట్ ప్రవేశపెట్టలేదని విమర్శించారు. ఖరీఫ్ సీజన్ ముగిసి రబీకి సమయం ఆసన్నమవుతున్నా ఇప్పటి వరకు అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు రూ.20వేల పెట్టుబడి సాయం అందించలేదన్నారు. తల్లికి వందనం, ప్రతి కుటుంబానికీ మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, 18 నుంచి 59 ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ.1500, ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం, ప్రతి ఇంటికీ జాబ్ లేదా నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి పథకాల ఊసే లేదన్నారు. 'సూపర్ సిక్స్' అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని చంద్రబాబు సర్కారుపై మండిపడ్డారు.

వరదలపై సరే.. జిల్లా కరువు పరిస్థితేంటి?

వరదలతో ఇబ్బంది పడుతున్న విజయవాడ వాసులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇతోధికంగా సహకరించాలని అనంత సూచించారు. అయితే వరదను సాకుగా చూపి జిల్లాలోని కరువు పరిస్థితులపై సీఎం చంద్రబాబు మాట్లాడకపోవడం సరికాదన్నారు. జిల్లాలో రెండు నెలల పాటు చుక్క వర్షం పడలేదన్నారు. జూలైలోనే శ్రీశైలం ప్రాజెక్టు నిండిందన్నారు. హంద్రీ-నీవాకు 3,850 క్యూసెక్కులు రావాల్సి ఉండగా.. 2,200 క్యూసెక్కులు మాత్రమే వచ్చే పరిస్థితి ఉందన్నారు. కర్నూలు వద్ద టీడీపీ నాయకుడు హైవే పనులు చేస్తున్న కారణంగా ప్రస్తుతం 1,300 నుంచి 1,400 క్యూసెక్కులు మాత్రమే వస్తున్నా కలెక్టర్ నుంచి ఇరిగేషన్ అధికారుల వరకు ఎవ్వరూ నోరు మెదపడం లేదన్నారు. హంద్రీ-నీవా ద్వారా ఇప్పటికే 9 టీఎంసీలు డ్రా చేసినట్లు అధికారులు చెబుతున్నారని, హెచ్‌ఎల్‌ఎంసీకి 11 టీఎంసీలు వాడుకున్నట్లు అధికారికంగా చెబుతున్నారని అన్నారు. పీఏబీఆర్‌లో 2.3 టీఎంసీలు, ఎంపీఆర్‌లో 1.5 టీఎంసీల నీరు ఉందని గుర్తు చేశారు. తుంగభద్ర నుంచి నీరు రాకముందే పీఏబీఆర్‌లో 0.6 టీఎంసీలు ఉండేదని, దాంతో కలసి ఇప్పుడు పీఏబీఆర్‌లో 2.3 టీఎంసీలు అయ్యిందన్నారు. మిగతా నీరు ఏమయ్యాయని అడిగితే బార్డర్‌లో 1.5 టీఎంసీల నీరు ఆవిరైపోయిందని చెబుతున్నారన్నారు. అంతా అగమ్యగోచరంగా మారిపోయిందన్నారు. ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు సమావేశంలో 10 టీఎంసీల కేసీ కెనాల్ డైవర్షన్ నీరు ఎలా తీసుకోవాలన్న దానిపై చర్చ జరగలేదన్నారు. శింగనమల, రాప్తాడు, మడకశిర, పెనుకొండ, అనంతపురం రూరల్ ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉందన్నారు. రెండు నెలలుగా మిడ్‌పెన్నార్ సౌత్, నార్త్ కెనాల్‌కు నీరివ్వలేదన్నారు. స్వాక్షాత్తు టీడీపీకి చెందిన ప్రజాప్రతినిధులు కూడా తాము చేతగాని పరిస్థితిలో ఉన్నామని చెబుతున్నారన్నారు.

> **దోపిడీ జరుగుతున్నట్లు ఎమ్మెల్యేలే చెబుతున్నారు**
>
> జిల్లాలో మట్టి, ఇసుక దోపిడీ జరుగుతోందని, ఈ విషయాన్ని స్వయంగా ఎమ్మెల్యేలే చెబుతున్నారని, పోలీసు స్టేషన్ల వద్ద ధర్నా చేసిన ఘటనలూ ఉన్నాయని అనంత తెలిపారు. అవినీతి, దందాలపై టీడీపీ నాయకులే పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారన్నారు. ఉచిత ఇసుక పేరుతో గడిచిన మూడు నెలల్లో భారీగా దోపిడీ చేశారన్నారు. జిల్లా అంతటా నియోజక వర్గాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఇదే విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసు తీసుకోకపోగా.. ఊరు విడిచి వెళ్లాలని చెప్పే స్థితికి పోలీసు వ్యవస్థ దిగజారిందని విమర్శించారు. జిల్లాలోని అనేక లాడ్జీలు జూద కేంద్రాలుగా మారాయన్నారు. ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలోనే ఇవి నడుస్తున్నాయన్నారు.

> **బాబు మాటలు బాధ్యతా రాహిత్యం**
>
> తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం విషయంలో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని అనంత విమర్శించారు. ఆయన వ్యాఖ్యలు కోట్లాదిమంది భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నాయన్నారు. లడ్డూల విషయంలో చంద్రబాబు ఒక మాట, టీటీడీ ఈఓ శ్యామలరావు మరో మాట మాట్లాడుతున్నారన్నారు. టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ అధికార ప్రతినిధి రిపోర్టుల గురించి మాట్లాడడం ఏంటని నిలదీశారు. లడ్డూలపై వచ్చిన ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుంటున్న సీఐ కౌలుట్లయ్య

శింగనమల: మండల పరిధి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీఐ కౌలుట్లయ్య అదుపులోకి తీసుకున్నారు. వివరాలు... శింగనమల మండలం కల్లుమడి, తరిమెల గ్రామాల సమీపంలోని పెన్నానది పరివాహక ప్రాంతం నుంచి రోజూ వందలాది ట్రాక్టర్లలో ఇసుకున్న తరలిస్తున్నట్లుగా సమాచారం అందుకున్న సీఐ కౌలుట్లయ్య శుక్రవారం ఆకస్మిక తనిఖీలకు బయలుదేరారు. మార్గం మధ్యలో ప్యాపినేపాళ్యం వద్దకు చేరుకోగానే ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి, స్టేషన్‌కు తరలించారు. కాగా, పట్టుబడిన ట్రాక్టర్లు టీడీపీ నేతలకు చెందినవిగా పోలీసుల విచారణలో నిర్ధారణ అయింది.

రూ.50 కోసం చితకబాదారు

పెద్దవడుగూరు: అప్పుగా తీసుకున్న రూ.50 చెల్లించాలని అడిగినందుకు ఓ యువకుడిపై ముగ్గురు వ్యక్తులు కర్రలతో దాడి చేశారు. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దవడుగూరు మండలం భీమునిపల్లికి చెందిన నాగరాజు తన ద్విచక్ర వాహనంలో పెట్రోల్ అయిపోవడంతో అటుగా వెళుతున్న అదే గ్రామానికి చెందిన సుంకన్నతో రూ.50 అప్పుగా ఇప్పించుకున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి బాగా పొద్దుపోయిన తర్వాత సుంకన్న కుమారుడు పెద్దిరాజు... నాగరాజు ఇంటికి వెళ్లి రూ.50 ఇవ్వాలని అడిగాడు. ఆ సమయంలో నాగరాజు, ఆయన కుటుంబసభ్యులు రాజశేఖర్, కమ్మక్క దుర్భాషలాడుతూ పెద్దిరాజుపై కర్రలతో దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు.

30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలి : ఎస్టీయూ

అనంతపురం ఎడ్యుకేషన్: పీఆర్సీ ప్రకటన ఆలస్యమవుతున్న నేపథ్యంలో తక్షణమే ఉద్యోగులకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని కూటమి సర్కార్‌ను రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం నార్పల మండలంలోని వివిధ పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు చేపట్టిన వారు మాట్లాడుతూ... సంవత్సరాల తరబడి పేరుకుపోయిన బకాయిల కోసం ఉద్యోగులు ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. తాము దాచుకున్న డబ్బు నుంచి పీఎఫ్ లోన్లు, ఏపీజీఎల్ఐ లోన్లు, ఫైనల్ పేమెంట్స్, ఆర్జిత సెలవుల నగదు చెల్లింపులో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. దాచుకున్న డబ్బు పిల్లల చదువులు, ఇంటి నిర్మాణాలు, పిల్లల పెళ్లిళ్లకు ఉపయోగపడుతుందని ఆశించిన ఉద్యోగులకు నిరాశ మిగిలిందని వాపోయారు. సమయానికి డబ్బు సమకూరకపోవడంతో అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. దీర్ఘకాలిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

- జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఆదేశం
- అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని సభ్యుల డిమాండ్
- అడవి జంతువుల బారి నుంచి పంటలు కాపాడాలని వేడుకోలు
- నష్టపోయిన రైతులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని పట్టు
- పశువుల షెడ్ల కేటాయింపులో పార్టీలు చూడొద్దని వినతి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు

అనంతపురం సిటీ: సమావేశంలో ఏ నిర్ణయం తీసుకున్న రైతు సంక్షేమానికి దోహదపడేలా ఉండాలని అధికారులను జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఆదేశించారు. ఓ వైపు ప్రకృతి వైపరీత్యాలు. మరో వైపు అడవి జంతువుల బెడద నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారని, చివరకు మార్కెట్ మాయాజాలంలో చిక్కుకుని తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్త చేశారు. ఈ సమస్యల నుంచి రైతులను గట్టెక్కించేలా ప్రతిపాదనలు సిద్ధం చసి ప్రభుత్వానికి అందజేయాలని సూచించారు. ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు అనంతపురంలోని జెడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. స్థాయీ సంఘం-1, 2, 4, 7(ప్రణాళిక, ఆర్థిక/గ్రామీణాభివృద్ధి/ విద్య, వైద్య/ఇంజినీరింగ్ శాఖలు) సమావేశాలను బోయ గిరిజమ్మ అధ్యక్షతన నిర్వహించారు. సీఈఓ ఓబులమ్మ పాల్గొన్నారు. గత సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన అంశాలపై ఏం చర్యలు తీసుకున్నారో వివరించాలని అధికారులకు గిరిజమ్మ సూచించారు. ఆ తర్వాత రైతుల కష్టాలను సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. అడవి జంతువులను కట్టడి చేసి పంటలను కాపాడాలని, ఇప్పటికే నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. దీనిపై అటవీ శాఖ అధికారి మాట్లాడుతూ.. వన్యప్రాణుల ద్వారా పంట నష్టపోయిన రైతులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించే వెసులుబాటు ఉందన్నారు. అయితే వాటి విధి విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలని గిరిజమ్మ సూచించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆపేస్తే ఎలా?

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకుపోయాయని, విద్యార్థులకు హాల్ టిక్కెట్లు ఇవ్వకుండా, తరగతులకు హాజరు కాకుండా కొన్ని విద్యా సంస్థల యాజమాన్యాలు వేధిస్తున్నాయని సభ్యులు ఆరోపించారు. దీంతో డిగ్రీ, ఆ పై తరగతులు చదివే విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఆర్ఐఓ వెంకటరమణా నాయక్, డీఈఓ వరలక్ష్మి స్పందించారు. ఇంటర్ వరకూ అమ్మ ఒడి వర్తిస్తుందని, ఆ పై సాంకేతిక, ఇతర ఉన్నత విద్య చదివే విద్యార్థులకు మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుందని, ఈ అంశం తమ పరిధిలో లేదని పేర్కొన్నారు.

షెడ్ల కేటాయింపులో పార్టీలు చూడొద్దు..

గుమ్మఘట్ట జెడ్పీటీసీ మహేష్ అధ్యక్షతన జరిగిన వ్యవసాయ శాఖ సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ... పశువుల పోషణకు సంబంధించి షెడ్ల నిర్మాణంపై కొన్ని మండలాల ఎంపీడీఓలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, మరికొన్ని మండలాల్లో టీడీపీకి చెందిన వారికే మంజూరు చేస్తామని బహిరంగంగా చెబుతున్నారంటూ మండిపడ్డారు. పశు పోషకుల విషయంలో పార్టీలు చూడడం సరికాదని హితవు పలికారు. అర్హత కలిగిన పాడి రైతులందరికీ పథకాలు వర్తించేలా చూడాలని కోరారు.

బాల్య వివాహాల కట్టడికి సహకరించండి..

జెడ్పీలోని అదనపు సమావేశ భవన్‌లో జరిగిన స్థాయీ సంఘం-5(ఐసీడీఎస్) సమావేశానికి ఆ సంఘం చైర్ పర్సన్ హెచ్.హసీనాబాను అధ్యక్షత వహించారు. డిప్యూటీ సీఈఓ లలితాబాయి హాజరయ్యారు. బాల్య వివాహాలను కట్టడి చేసేందుకు తమ శాఖ వంద రోజుల ప్రణాళిక రూపొందించుకొని ఊరూరా, వాడవాడలా ప్రచారం చేస్తోందని, ప్రజాప్రతినిధులు కూడా భాగస్వాములై బాల్య వివాహాల నిరోధానికి సహకరించాలని ఉభయ జిల్లాల ఐసీడీఎస్ పీడీలు శ్రీదేవి, నాగమల్లేశ్వరి కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో అక్కడక్కడ తలెత్తుతున్న సమస్యలను అధికారుల దృష్టికి సభ్యులు తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.

బిల్లులు చెల్లించకపోతే పనులు ఆపేస్తాం..

గతంలో చేసిన రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణాలకు సంబంధించి బిల్లులు రూ.లక్షల్లో పేరుకుపోయాయని, వీటిని చెల్లించకుండా కూటమి సర్కార్ నిర్లక్ష్యం వహిస్తోందని సభ్యులు మండిపడ్డారు. బిల్లులు మంజూరు చేయకపోతే ఎక్కడికక్కడ పనులు ఆపేస్తామని హెచ్చరించారు. మిగిలిన శాఖలకు సంబంధించిన అధికారులు తమ శాఖల ప్రగతిని చదివి వినిపించారు. గత సమావేశాల్లో సభ్యులు అడిగిన ప్రశ్నలకు తీసుకున్న చర్యలను వివరించారు.

సాంఘిక సంక్షేమ శాఖలపై..

స్థాయీ సంఘం-6 సమావేశం అదనపు భవన్‌లో ఆ సంఘం చైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులతో పాటు అనుబంధ శాఖల అధికారులూ హాజరయ్యారు. హాస్టళ్లలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. చలికాలం వస్తున్నందున హాస్టళ్లలో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. ఇందుకు అధికారులు సానుకూలంగా స్పందించారు.

అక్రమార్కులను వదిలి మాపై ప్రతాపమా?

- సీఐ యుగంధర్ తీరుపై ఎడ్లబండ్ల యజమానుల ధ్వజం



సీఐ యుగంధర్‌ను ఘెరావ్ చేస్తున్న ఇసుక బండ్ల నిర్వాహకులు

పామిడి: ఇసుకను తరలించేందుకు స్థానిక పెన్నానదికి చేరుకున్న ఎద్దుల బండ్లను సీఐ యుగంధర్ అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించడం వివాదాస్పదమైంది. ఏకంగా 12 బండ్లను పోలీస్ స్టేషన్‌కు చేర్చడంతో ఒక్కసారిగా స్థానికులు, ఇసుక బండ్ల యజమానుల కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని ఆందోళనకు దిగారు. తాము అక్రమంగా ఇసుక దందా చేయడం లేదని, బతుకు తెరువు కోసం స్థానికంగా చేపట్టిన గృహ నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి మాత్రమే ఇసుకను తరలిస్తున్నట్లుగా ఆందోళనకారులు తెలిపారు. టీడీపీ నేతలు సాగిస్తున్న ఇసుక అక్రమ దందాను అరికట్టలేక బడుగులైన తమ పొట్ట కొట్టడం సబబు కాదని నినదించారు. దీంతో సీఐ యుగంధర్ మరింత రెచ్చిపోయారు. కేసులు నమోదు చేస్తామంటూ ఇసుక బండ్ల నిర్వాహకులను బెదిరించారు. దీంతో ఒక్కసారిగా అక్కడ పరిస్థితి అదుపు తప్పింది. రేయింబవళ్లు టిప్పర్లు, ట్రాక్టర్లు పెట్టి ఇసుక అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్న టీడీపీ నేతపై ముందుగా కేసులు నమోదు చేసి, ఆ తర్వాత తమపై దృష్టి సారించాలన్నారు. ఎద్దుల బండ్లను స్టేషన్ ప్రధాన ద్వారానికి అడ్డుగా పెట్టి ధర్నా చేపట్టారు. దీంతో సీఐ ఎద్దుల బండ్లతో పాటు నిర్వాహకులను బలవంతంగా తహసీల్దార్ కార్యాలయానికి తరలించి, తహసీల్దార్ ఎస్.శ్రీధర్‌బాబు ఎదుట బైండోవర్ చేయించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. పెన్నానది నుంచి ఇసుకను గ్రామ పంచాయతీ, సంబంధిత అధికారుల అనుమతి పొందిన తర్వాతనే తరలించాల్సి ఉంటుందన్నారు. బైండోవర్ అయిన ఇసుక బండ్ల యజమానులు ఈ సారి పట్టుబడితే రూ.50 వేలు జరిమానా చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కాగా, సీఐ యుగంధర్ తీరుపై గ్రామంలో సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి.

చంద్రబాబు కుయుక్తులు క్షమించరానివి

- రాజకీయ లబ్ధి కోసం హిందువుల విశ్వాసాలతో చెలగాటం
- సీఎం చంద్రబాబు వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



ఉరవకొండ: రాజకీయ లబ్ధి కోసం టీటీడీ ప్రతిష్టను దిగజార్చేలా ప్రవర్తిస్తున్న సీఎం చంద్రబాబు కుయుక్తులు క్షమించరానివని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అన్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిన నెయ్యి వాడారంటూ హిందువుల మనోభావాలు దెబ్బతినేలా చంద్రబాబు వ్యాఖ్యానించడం ఆయన దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. వజ్రకరూరు మండలం కొనకొండ్లలోని తన స్వగృహంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీవారి లడ్డూ ప్రసాదంపై సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. చంద్రబాబు ఉన్మాద రాజకీయాలు పరాకాష్టకు చేరుకున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టీటీడీ చైర్మన్లుగా కొనసాగిన వై.వి.సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి... తిరుమల పవిత్రతను కాపాడుతూ భక్తుల మనోభావాలకు అనుగుణంగా శ్రీవారి సేవలు తరించారన్నారు. 2019 నుంచి 2024 వరకు స్వామి వారి లడ్డూ ప్రసాదంలో దినుసుల నాణ్యత ప్రమాణాలన్నీ పరిశీలించిన తర్వాతే ప్రసాద వినియోగానికి వినియోగించారన్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదంపై వివాదస్పద వ్యాఖ్యలు చేసినందుకు హిందూ సమాజానికి సీఎం చంద్రబాబు బేషరత్తుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి



పోలీసు సిబ్బంది గ్రీవెన్స్‌లో పాల్గొన్న ఎస్పీ జగదీష్

అనంతపురం: పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్పీ పి.జగదీష్ భరోసానిచ్చారు. పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. బదిలీలు, సస్పెన్షన్ రీవోక్, ఇతర సమస్యలపై 8 వినతులు అందాయి. సర్వీసు రూల్స్ ప్రకారం వీటికి పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డీవీ రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మర్యాద పూర్వకంగా వ్యవహరించండి

కూడేరు: సమస్యల పరిష్కారం కోసం పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందిని ఎస్పీ జగదీష్ ఆదేశించారు. శుక్రవారం ఆయన కూడేరు, ఉరవకొండ పోలీసు స్టేషన్లను ఆకస్మిక తనిఖీ చేశారు. కూడేరు మండలంలో శాంతి భద్రతలపై సీఐ శివరాముడితో ఆరా తీశారు. పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు.

పోలీసుల అదుపులో బెట్టింగ్‌రాయుళ్లు

అనంతపురం: ఆర్డీటీ స్టేడియంలో క్రికెట్ బెట్టింగ్‌రాయుళ్లను రాప్తాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దులీప్ ట్రోఫీలో భాగంగా అనంతపురం సమీపంలోని ఆర్డీటీ స్టేడియంలో క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. బెంగళూరు నుంచి వచ్చిన కొందరు వ్యక్తులు ఏ- మైదానంలో గల ఈ-ఎఫ్ గ్యాలరీల్లోకి ప్రవేశించి బెట్టింగ్ ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. రాప్తాడు పోలీసులు వెంటనే అప్రమత్తమై స్టేడియంలోకి చేరుకుని 15 మంది బెట్టింగ్ రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 15 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బెట్టింగ్ ముఠాలోని కీలక సభ్యుడి కోసం గాలిస్తున్నారు. అదుపులోకి తీసుకున్న వారిని రహస్య ప్రదేశంలో విచారణ చేస్తున్నారు. బెంగళూరు నుంచి వచ్చి ఇక్కడ పాసులు ఎలా పొందారనే కోణంలోనూ విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

రెండో రోజూ పరుగుల వరద

- సెంచరీతో ఆకట్టుకున్న అభిమన్యు, సంజు
- అభిమానులను నిరాశపరిచిన సూర్యకుమార్‌యాదవ్
- ఇండియా- బీ 210/6
- ఇండియా-సీ 216/7





సెంచరీ అనంతరం అభివాదం చేస్తున్న అభిమన్యు ఈశ్వరన్, సంజు శాంసన్

అనంతపురం: అనంత క్రీడా గ్రామం వేదికగా బీసీసీఐ ఆధ్వర్యంలో దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నీ ఉత్కంఠగా సాగుతోంది. ఇండియాఏ, సీ జట్ల మధ్య, ఇండియా-బీ, డీ జట్ల మధ్య చివరి రౌండ్ రెండో రోజు మ్యాచ్‌లు హోరాహోరీగా జరిగాయి.

శతకాల మెరుపులు

306/5 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండో రోజు ఆట కొనసాగించిన ఇండియా-డీ జట్టు .. 87.3 ఓవర్ల వద్ద 349 పరుగులకు ఆలౌట్ అయింది. ఇండియా- బీ బౌలర్ నవదీప్ షైనీ ఐదు వికెట్లను కైవసం చేసుకున్నాడు. ఇండియా-డీ జట్టులో సంజు శాంసన్ 106 (101 బంతుల్లో 12 ఫోర్లు, మూడు సిక్సర్లు)తో ఆకట్టుకున్నాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఇండియా-బీ జట్టు ఆట ముగిసే సమయానికి 58 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 210 పరుగులు చేసింది. జట్టులో కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ మరోసారి తనదైన శైలిలో చెలరేగి 116 (170 బంతుల్లో 13ఫోర్లు, 1 సిక్సర్) పరుగులు చేశాడు. జగదీషన్ 13, సుయాష్ ప్రభుదేశాయ్ 16, ముషీర్ ఖాన్ 5, సూర్యకుమార్ యాదవ్ 5, నితీష్ కుమార్ రెడ్డి డకౌట్ అయ్యారు. క్రీజులో వాషింగ్టన్ సుందర్ 39, రాహుల్ చహార్ 0 ఉన్నారు. ఇండియా -డీ బౌలర్లలో అర్షదీప్ సింగ్ 3, ఆదిత్య థాకరే 2 వికెట్లు తీశారు.

బౌలర్ల ధాటికి 'సీ' విలవిల

224/7 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు ఆట కొనసాగించిన ఇండియా-ఏ జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో 297 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులో రావత్ 124, అవేశ్‌ఖాన్ 51 (5 ఫోర్లు, 4 సిక్స్‌లు), శామ్స్ ములాని 44 (5 ఫోర్లు, ఒక సిక్సర్), ప్రసిద్ధ్ కృష్ణ 34(7 ఫోర్లు) సాధించారు. ఇండియా -సీ బౌలర్లు వైశాఖ్ 4, అన్షుల్ కాంభోజ్ 3, గౌరవ్ యాదవ్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఇండియా-సీ జట్టు ఆట ముగిసే సమయానికి 7 వికెట్లు కోల్పోయి 216 పరుగులు చేసింది. ఇండియా-ఏ బౌలర్ అకీబ్‌ఖాన్ (3 వికెట్లు), శామ్స్ ములాని (2 వికెట్లు) ధాటికి 'సీ' జట్టు బ్యాటర్లు నిలవలేకపోయారు. ఇండియా-సీ జట్టులో అభిషేక్ పోరెల్ 82 (113 బంతుల్లో 9 ఫోర్లు) పరుగులు చేశాడు. బాబా ఇంద్రజిత్ 34, రుతురాజ్ గైక్వాడ్ 17, సాయి సుదర్శన్ 17 పరుగులు చేశారు. నారంగ్ 35, వైశాఖ్ 14 పరుగులతో క్రీజులో ఉన్నారు.

మార్కెట్ యార్డు సెక్రటరీగా గోవిందు



అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి (సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ)గా కె.గోవిందు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు మార్కెట్ యార్డు నుంచి డిప్యుటేషన్‌పై ఆయన జిల్లాకు బదిలీ అయ్యారు. ఇక్కడున్న సెక్రటరీ ఆర్.జయలక్ష్మి డిప్యుటేషన్‌పై కర్నూలుకు వెళ్లారు. ఈ క్రమంలో గురువారం ఆమె ఇక్కడి నుంచి రిలీవ్ కాగా, ఆ స్థానంలో కె.గోవిందు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

జీఓ 85 రద్దు చేయాలి



డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవికి వినతి పత్రం ఇస్తున్న పీహెచ్‌సీ వైద్యుల సంఘం నాయకులు

అనంతపురం మెడికల్: పీజీ వైద్య విద్యలో ఇన్‌సర్వీస్ కోటాను కుదిస్తూ జారీ చేసిన జీఓ 85ను తక్షణమే రద్దు చేయాలని ఏపీ పీహెచ్‌సీ వైద్యుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఐఎంఏ హాల్‌లో సమావేశమైన వారు... అనంతరం ర్యాలీగా డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి చేరుకుని, డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గిరిజన ప్రాంతాల్లో విధులు నిర్వర్తించే వైద్యులకు అలవెన్స్‌లు ఇవ్వాలన్నారు. జీఓ 85 రద్దుపై స్పష్టత వచ్చే వరకూ విధులకు దూరంగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ నారాయణస్వామి, కోశాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్, డాక్టర్ మహేంద్రనాథ్ పాల్గొన్నారు.

లేదాళ్లకు విమలాశాంతి పురస్కారం



లేదాళ్ల రాజేశ్వరరావు

అనంతపురం కల్చరల్: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రతిష్టాత్మక కవులు, రచయితలకు అందించే విమలాశాంతి కవితా పురస్కారాన్ని ఈ ఏడాదికి గాను ప్రఖ్యాత కవి లేదాళ్ల రాజేశ్వరరావుకు అందించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు, డాక్టర్ వైఎస్సార్ జీవిత సాఫల్య అవార్డు గ్రహీత డాక్టర్ శాంతినారాయణ శుక్రవారం వెల్లడించారు. మంచిర్యాల జిల్లాకు చెందిన లేదాళ్ల రాజేశ్వరరావు రచించిన 'అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి' కవితా సంపుటిని పురస్కారానికి ఎంపిక చేశామన్నారు. అక్టోబర్ 10న అనంతలో జరిగే సాహితీ సభలో అవార్డుతో పాటు రూ.10వేల నగదు పురస్కారాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన మూడు వేర్వేరు ప్రాంతాలకు చెందిన సుప్రసిద్ధ సాహితీవేత్తలు ఆచార్య చల్లపల్లి స్వరూపారాణి, బెల్లంకొండ ప్రసేన్, తూముచర్ల రాజారాంకు ఈ సందర్భంగా డాక్టర్ శాంతి నారాయణ ధన్యవాదాలు తెలిపారు.

యువకుడి బలవన్మరణం

గార్లదిన్నె: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం మర్తాడు నివాసి శ్రీనివాసులు (35) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించిన నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకుని గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమి సంహారక మందు తాగాడు. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న తల్లి రాజేశ్వరి.. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న కుమారుడిని గమనించి, చుట్టుపక్కల వారి సాయంతో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లింది. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. చికిత్సకు స్పందించక శుక్రవారం ఉదయం శ్రీనివాసులు మృతి చెందాడు. ఘటనపై ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా హనుమంతరాయుడు



అనంతపురం ఎడ్యుకేషన్: రెండు రోజుల క్రితం జరిగిన అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) జిల్లా మహాసభల్లో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా హనుమంతరాయుడు, ప్రధాన కార్యదర్శిగా కుళ్లాయిస్వామి, జిల్లా ఆఫీస్ బేరర్లుగా నరసింహ యాదవ్, సాయిస్వరూప, రాధాజ్యోతి, వెంకట నాయక్, ఆంజనేయులు, వంశీ, మంజునాథ్, చందుతోపాటు 21 మంది కార్యవర్గ సభ్యులు, 45 మంది కౌన్సిల్ సభ్యులు ఎన్నికయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై జిల్లాలో సమరశీల పోరాటాలకు సిద్ధమవుదామంటూ ఈ సందర్భంగా నూతన కార్యవర్గం పిలుపునిచ్చింది.

ముగిసిన జిల్లా స్థాయి కుస్తీ పోటీలు

పామిడి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్ వేదికగా డీఎస్‌ఏ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల, బాలికల జిల్లా స్థాయి కుస్తీ పోటీలు శుక్రవారం ముగిసాయి. అండర్-19 ఫ్రీస్టైల్ విభాగంలో వైమాలిని, మైత్రి, మౌనిక, శ్రావణి, శ్రుతి, చంద్రకళ, స్పందన, మానస, బాలుర విభాగంలో ప్రవీణ్, దావూద్, మల్లికార్జున, కార్తీక్, రోషన్‌ఖాన్, గౌస్, శాంతి, యశ్వంత్, రంగస్వామి ప్రతిభ చాటారు. గ్రీకు రోమన్ విభాగంలో మధు, సంతోష, అన్వర్ రాణించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను కృష్ణా జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ కోచ్ ఎస్.రాఘవేంద్ర, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ లక్ష్మీనారాయణ, పీడీలు నాగరాజు, రామకృష్ణ, నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

గుత్తి: స్థానిక బండగేరికి చెందిన దాదా ఖలందర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు శుక్రవారం రాత్రి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. 9వ తరగతి చదువుతున్న తన కుమార్తెను ప్రేమించాలని తరచూ వెంటపడి వేధిస్తున్నాడని జడ్.వీరారెడ్డి కాలనీకి చెందిన బాధిత బాలిక తండ్రి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

కూడేరు ఎంఈఓ సస్పెన్షన్

కూడేరు: ఏసీబీ దాడిలో పట్టుబడిన కూడేరు ఎంఈఓ-1 చంద్రశేఖర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఓ ప్రైవేటు స్కూల్ యాజమాన్యంతో రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ రెండు రోజుల క్రితం ఆయన ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే.

బెస్ట్ సెరికల్చర్ సైంటిస్ట్‌గా డాక్టర్ కేపీ



అందుకున్న అవార్డుతో డాక్టర్ కేపీ కిరణ్‌కుమార్

అనంతపురం అగ్రికల్చర్: రాప్తాడులో ఉన్న ప్రాంతీయ పట్టు పరిశోధనా కేంద్రం జాయింట్ డైరెక్టర్ (జేడీ), సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కేపీ కిరణ్‌కుమార్‌కు బెస్ట్ సెరికల్చర్ సైంటిస్ట్ అవార్డు దక్కింది. కేంద్ర పట్టుమండలి, జౌళి మంత్రిత్వశాఖ 75వ వార్షికోత్సవం (ప్లాటినం జూబ్లీ) సందర్భంగా కర్ణాటకలోని మైసూరులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి, జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ తదితరుల చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు.

క్లుప్తంగా

రేపు జిల్లా స్థాయి పారా షూటింగ్ పోటీలు

అనంతపురం: స్థానిక నీరు ప్రగతి చెట్టు పార్కు వద్ద ఉన్న స్కేటింగ్ గ్రౌండ్‌లో ఈనెల 22న జిల్లా స్థాయి పారా షూటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పారా స్పోర్ట్ అసోసియేషన్ ఆఫ్ అనంతపురం సెక్రెటరీ ఎస్.శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ప్రతిభ కనబరిచిన వారిని ఈనెల 29న విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పారా షూటింగ్ పోటీలకు పంపుతామన్నారు.

రోడ్లపై చెత్త వేయొద్దు



ప్రసన్నాయపల్లిలో మొక్కకు నీరు పోస్తున్న ఎంపీడీఓ సాల్మన్

రాప్తాడు: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎంపీడీఓ సాల్మన్ అన్నారు. నాలుగో రోజు శుక్రవారం మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మన ఇంటితో పాటు వీధి, గ్రామం, మండలం, జిల్లా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రజలు చెత్తను ఎక్కడిపడితే అక్కడా వేయకూడదని సూచించారు. సమాజానికి, పర్యావరణానికి ప్లాస్టిక్ ఒక భూతంగా మారిందన్నారు. ప్లాస్టిక్‌ను నివారించకపోతే అనేక దుష్ఫలితాలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. అనంతరం మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నరసింహా రెడ్డి, సర్పంచ్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

మంచి ప్రభుత్వం కాదు.. మాయా ప్రభుత్వం

రాప్తాడు: సూపర్-6 పేరుతో రాష్ట్ర ప్రజలను చంద్రబాబు నాయుడు బురిడీ కొట్టించారని వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రా రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు తిరుపతి లడ్డూ డైవర్షన్ రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. తప్పుడు హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు పింఛన్ మినహా చేసింది ఏమీ లేదన్నారు. రైతుభరోసా రూ.20 వేలు, ఉచిత ఇసుక హామీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి ఇచ్చారా అని ప్రశ్నించారు. వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేసి మనకు రావాల్సిన మెడికల్ సీట్లను అమ్ముకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మత్తు పదార్థాలు హానికరం



మాట్లాడుతున్న బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి

అనంతపురం రూరల్: మత్తు పదార్థాలు వాడటం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి, నాల్గవ పట్టణ సీఐ సాయినాథ్ అన్నారు. శుక్రవారం రామ్‌నగర్‌లోని బీసీ బాలురు, బాలికల వసతి గృహాల్లో మత్తు పదార్థాలు వాడటం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ వెల్ఫేర్ డీడీ మాట్లాడుతూ.. యువత మత్తుకు బానిస అయితే లక్ష్యాలను చేరుకోలేరన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విశ్వనాథ్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బాలాజీ నాయక్, డాక్టర్ వెంకటక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

అనంతపురం: నగరంలోని నాయక్‌నగర్ సమీపంలోని కంపచెట్లలో పేకాట ఆడుతున్న ఆరుగురని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.23,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ సీఐ ఎం. శ్రీకాంత్ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అధ్యాపకులూ నిత్య విద్యార్థులే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ దేవన్న

అనంతపురం: అధ్యాపకులూ నిత్య విద్యార్థులే అని జేఎన్‌టీయూ అనంతపురం ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ దేవన్న అన్నారు. భారత ప్రభుత్వం ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ (ఐఎస్ఈఏ), సీడ్యాక్ (సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్ కంప్యూటింగ్) సహకారంతో జేఎన్‌టీయూ అనంతపురంలో ‘‘వన్ డే మాస్టర్ ట్రైనర్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఆన్ సైబర్ సెక్యూరిటీ అవేర్‌నెస్ ఆఫ్ అఫిలియేటెడ్ కాలేజెస్ అండర్ జేఎన్‌టీయూ’’ అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇలాంటి సదస్సులతో అధ్యాపకులకు నూతన సాంకేతిక అంశాలపై అవగాహన ఏర్పడుతుందన్నారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి. ప్రశాంతి పాల్గొన్నారు.

వంద రోజుల్లోనే చేతులెత్తేశారు !

‘‘మేము అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి ప్రాధాన్యం.. పేరూరు డ్యాంకు నీరు ఇవ్వడమే. పేరూరుకు నీరందించే పనులు వేగవంతం చేస్తాం. నాలుగు రిజర్వాయర్లు పూర్తి చేసి, నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయాలన్నదే మా తాపత్రయం. ప్రతి ఎకరాకు సాగు నీరు అందించే ప్రయత్నం చేస్తాం. ఇక్కడ యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తాం. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు తారు రోడ్లు వేయిస్తాం. ఎన్ని ఇబ్బందులు వచ్చినా బంగారు గనులు తెరిపిస్తాను. అబద్ధాలు చెప్పం.. అభివృద్ధి చేసి చూపిస్తాం’’ అని ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే పరిటాల సునీత ఓ దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. రాష్ట్రం బాగుండాలన్నా.. రాప్తాడు అభివృద్ధి జరగాలన్నా టీడీపీకి ఓటు వేయాలని ప్రచారం చేశారు. తీరా గెలిచాక హామీలు అమలు చేయకుండా ప్రజలకు పంగనామాలు పెట్టారని స్థానికులు మండిపడుతున్నారు.



- అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా హామీలను పట్టించుకోని ఎమ్మెల్యే పరిటాల సునీత
- జాతీయ రహదారి పక్కన పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని చెప్పి కుచ్చుటోపీ
- జాకీ పరిశ్రమను రప్పిస్తామని చెప్పి పట్టించుకోని వైనం
- రామగిరి బంగారు గనులపై నోరుమెదపని సునీత
- హామీలపై ప్రశ్నిస్తున్న ప్రజలపై దాడులు


కనగానపల్లి: రాప్తాడు నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామంటూ ఎన్నికల సమయంలో చంద్రబాబు, పరిటాల సునీత ఎన్నో హామీలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాప్తాడు నియోజకవర్గం మీదుగా వెళ్లే 44వ జాతీయ రహదారి పక్కన పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తామని చంద్రబాబుతో పాటు ఎమ్మెల్యే పరిటాల సునీత ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. గతంలో ఏర్పాటు చేయాలనుకున్న జాకీ పరిశ్రమతో పాటు కొత్త పరిశ్రమలు తీసుకొస్తామని చెప్పారు. ఇక్కడి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడినా ఒక్క పరిశ్రమ కూడా రాకపోవడంతో నిరుద్యోగ యువత తీవ్ర నిరాశ చెందుతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు గడుస్తున్నా నియోజకవర్గ ప్రజలుకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చిన పాపాన పోలేదు. హామీలపై ప్రజలు ఎవరైనా ప్రశ్నిస్తే టీడీపీ నాయకులతో దాడులు చేయిస్తున్నారు. దీంతో హామీల గురించి అడిగేందుకు ప్రజలు జంకుతున్నారు.

జీడిపల్లి–పేరూరు డ్యాం కాలువ పనులకు మోక్షమెప్పుడో?

హంద్రీనీవా కాలువ నుంచి రామగిరి మండలంలో ఉన్న పేరూరు డ్యాంకు నేరుగా నీటిని తీసుకెళ్లేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.803 కోట్లు మంజూరయ్యాయి. భూ సేకరణ పనులు కూడా చేపట్టకుండా అప్పట్లో ఈ పనులు ప్రారంభించి వదిలేశారు. తర్వాత 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అదే నిధులతో నియోజకవర్గంలో నాలుగు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కాగా తాము తిరిగి అధికారంలోకి వస్తే జీడిపల్లి నుంచి నుంచి పేరూరు డ్యాం వరకు కాలువ పనులు పూర్తి చేయిస్తామని టీడీపీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసిన పరిటాల సునీత ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. తీరా గెలిచాక ఆ కాలువ పనుల గురించి ఏ మాత్రం పట్టించువడం లేదని స్థానిక రైతులు విమర్శిస్తున్నారు. కనీసం కాలువ కోసం భూములు కోల్పోయిన రైతులకు కూడా ఇంత వరకూ పరిహారం ఇప్పించలేదని మండిపడుతున్నారు.



ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆత్మకూరు వద్ద జీడిపల్లి-పేరూరు డ్యాం కాలువను పరిశీలిస్తున్న చంద్రబాబు, పరిటాల సునీత (ఫైల్)



ఆత్మకూరు వద్ద ఆగిపోయిన జీడిపల్లి-పేరూరు డ్యాం కాలువ పనులు



ఓ దినపత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చిన ఎమ్మెల్యే పరిటాల సునీత (ఫైల్)

వైఎస్ జగన్ పాలనలో అభివృద్ధి..

ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. వంద రోజులకే ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత కనిపిస్తోంది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు ఉమ్మడిగా ఉన్న రాప్తాడు నియోజకవర్గంలో కూడా అభివృద్ధి కుంటుపడింది. గతంలో ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతంగా ఈ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొంత అభివృద్ధి పనులు జరిగాయి. ముఖ్యంగా ఈ నియోజవర్గంలో ఉన్న పేరూరు డ్యాంకు నాలుగేళ్ల పాటు హంద్రీ-నీవా కాలువ ద్వారా నీరందించి ఈ కరువు ప్రాంతాన్ని సస్యశ్యామలంగా మార్చేందుకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కృషి చేసింది.

పరిశ్రమలు ఎక్కడ సునీతమ్మా?

44వ జాతీయ రహదారి పక్కన పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత ఎన్నికల ప్రచారం చేశారు. గెలిపిస్తే కొత్త పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. తీరా గెలిచార పరిశ్రమల ఏర్పాటుపై మాట్లాడటం లేదు. నిరుద్యోగులను ఆదుకుంటామని చెప్పి నిండా ముంచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్క పరిశ్రమను తీసుకొచ్చిన దాఖలాలు లేవు. ఇప్పుడు హామీలను కప్పిపుచ్చుకునేందుకు మంచి ప్రభుత్వం పేరుతో అభివృద్ధి చేశామంటూ డ్రామాలు ఆడుతున్నారు. పరిటాల సునీతమ్మ పనితీరుపై నియోజకవర్గ ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది.

పరిహారం ఇవ్వరా సునీతమ్మా?



జీడీపల్లి నుంచి పేరూరు డ్యాంకు నీటిని నేరుగా తరలించేందుకు గతంలోనే మా భూములు తీసుకున్నారు. ఇందులో నాకున్న ఏడున్నర ఎకరాల భూమి కాలువకు పోయింది. భూములు కోల్పోయిన రైతులందరికీ ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించి కాలువ పనులు పూర్తి చేయిస్తామని పరిటాల సునీత హామీ ఇచ్చారు. కాని ఇంతవరకూ దాని గురించి మాట్లాడలేదు. మాకు పరిహారం కూడా అందలేదు.

– గోపాల్, రైతు, కొత్తపల్లి, ఆత్మకూరు మండలం

పరిశ్రమలు వస్తాయా?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాప్తాడు నియోజకవర్గంలో విస్తృతంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కాని నియోజకవర్గంలో ఎక్కడా కొత్తగా ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. మాలాంటి యువకులంతా ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఎమ్మెల్యే సునీత గెలిచేందుకు అలివికాని హామీలు ఇచ్చారు. గ్రామాల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పి.. ప్రజలందరినీ మోసం చేశారు.

– నరసింహులు, శేషంపల్లి, రామగిరి మండలం

సాగునీరు ఎప్పుడిస్తారు?



ఎన్నికల ప్రచారంలో నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు ఇస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత చెప్పారు. ఇప్పుడేమో సాగునీటి ప్రాజెక్టులపై పెదవి విప్పడం లేదు. చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి. ఓట్ల కోసం వీరు ఇచ్చిన హామిలన్నీ నీరుగారిపోతున్నాయి. రోడ్ల గురించి మాట్లాడటం లేదు. ఏదో అన్ని హామీలు నెరవేర్చినట్లుగా మంచి ప్రభుత్వం పేరుతో డబ్బా కొట్టుకుంటున్నారు.

– వరలక్ష్మి, కనగానపల్లి

ప్రజానాయకుడు సీతారాం ఏచూరి

అనంతపురం అర్బన్: కమ్యూనిస్టు ఉద్యమ నేత, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి గొప్ప ప్రజానాయకుడని వక్తలు కొనియాడారు. లౌకికతత్వం, ప్రజాస్వామ్యం, ఫెడరల్ విధానం, సామాజిక న్యాయం అనే రాజ్యాంగ హక్కులను కాపాడేందుకు కృషి చేసిన ఆయన జీవితం ఆదర్శం అన్నారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక లలిత కళాపరిషత్‌లో సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పీసీసీ మాజీ చీఫ్ డాక్టర్ సాకే శైలజనాథ్ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యేలు అనంతవెంకటరామిరెడ్డి, వై.విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, మేయర్ వసీం, ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, మానవ హక్కుల వేదిక నాయకుడు చంద్రశేఖర్, సీపీఎం రాష్ట్ర నాయకుడు ఓబుళు, సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, హాజరయ్యారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక ఎస్ఎంబాషా, డాక్టర్ భానుకిరణ్, తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి, డాక్టర్ ప్రసూన, ఐద్వా సావిత్రి, కేవీరమణ, ఇంతియాజ్, నల్లప్ప, నాగేంద్ర, వైసీపీ నాయకుడు గౌస్‌బేగ్ మాజీ సైనిక సంక్షేమ సంఘం నాయకుడు షేకన్న, మహబోధి కృష్ణమూర్తి, సీపీఐఎంఎల్ చంద్రశేఖర్, న్యూ డెమోక్రసీ నాయకుడు ఏసురతనం, ఎస్‌యూసీఐ రాఘవేంద్ర, వామపక్ష పార్టీల నాయకులు, యువజన, కార్మిక, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సీతారాం ఏచూరి సంస్మరణ సభలో నినాదాలు చేస్తున్న నాయకులు

ఆదాయం పెంచుకోవాలి

అనంతపురం అగ్రికల్చర్: మార్కెటింగ్ ఫీజు వసూళ్లలో వెనుకబడిన మార్కెట్ కమిటీలు లక్ష్యానికి చేరుకునేలా ఆదాయం పెంచుకోవాలని ఆ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) సి.రామాంజనేయులు ఆదేశించారు. శుక్రవారం స్థానిక మార్కెటింగ్‌శాఖ కార్యాలయంలో రెండు జిల్లాల ఏడీఎంలు పి.సత్యనారాయణ చౌదరి, ఎల్ఎన్ మూర్తితో కలిసి 16 మార్కెట్‌యార్డుల సెక్రటరీలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. 16 మార్కెట్ కమిటీలు, 30 వరకు ఉన్న చెక్‌పోస్టుల్లో విజిలెన్స్ చర్యలు పటిష్టంగా చేపడితే అనుకున్న లక్ష్యాలు సాధిస్తారన్నారు. చాలా కమిటీలు వెనుకడటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు వంద శాతం లక్ష్యాన్ని అధిగమించాలని సూచించారు. అనంతపురం జిల్లా పరిధిలో ఉన్న 9 మార్కెట్ కమిటీలకు ఇచ్చిన రూ.12.06 కోట్లకు గానూ ఐదు నెలల కాలంలో 35 శాతంతో రూ.4.13 కోట్లు మేర వసూలైందన్నారు. ఇందులో గుత్తి, గుంతకల్లు, రాప్తాడు, రాయదుర్గం కమిటీలు వెనుకబడ్డాయన్నారు. ఇక సత్యసాయి జిల్లా పరిధిలో ఉన్న ఏడు మార్కెట్ కమిటీలకు ఈ ఏడాది రూ.5.31 కోట్లు టార్గెట్ ఇవ్వగా ప్రస్తుతానికి 35 శాతంతో రూ.1.79 కోట్లు వసూలైనట్లు తెలిపారు. ఇందులో కూడా ధర్మవరం, హిందూపురం, కదిరి లాంటి కమిటీలు వెనుకబడినట్లు తెలిపారు. మార్కెట్ యార్డుల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, రైతు సేవలు, పశువులు, జీవాల సంతలు, చీనీ, చింత, మిరప, ఇతరత్రా వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలు తదితర అంశాలపై సమీక్షించారు.



మాట్లాడుతున్న ఆర్జేడీ సి.రామాంజనేయులు

సంక్షిప్త సమాచారం

డీసీఓను సస్పెండ్ చేయాలి



ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన దళిత ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు

అనంతపురం అర్బన్: గురుకుల పాఠశాలల్లో ప్రవేశ ప్రక్రియలో అవినీతికి పాల్పడిన డీసీఓను సస్పెండ్ చేయాలని దళిత ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. మునిసిపల్ కార్మికుల సంఘం అధ్యక్షుడు అజయ్ బాబు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ తిరుపాలు ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు సంబంధించి ప్రక్రియలో డీసీఓ మురళీకృష్ణ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఆధారాలతో సహా రెండు నెలల క్రితమే కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించడం జరిగిందన్నారు. అయితే విచారణ పేరుతో కాలయాపన చేయడం ఏమిటని ప్రశ్నించారు. దీక్షకు వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుడు శ్రీరాఘవ, జనసేన ఎస్సీ సెల్ నాయకుడు శివ, సీపీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్, వీసీకే రాష్ట్ర కార్యదర్శి మందల రమేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్, వైఎస్సార్‌సీపీ నాయకులు కాటమయ్య, పకీరప్ప సంఘీభావం ప్రకటించారు.

ప్రింటర్లు పని చెయ్యకపోతే ఎలా?

ఆత్మకూరు: మండలంలోని సచివాలయాల్లో చాలా చోట్ల ప్రింటర్లు, యూపీఎస్‌లు పని చెయ్యడం లేదని ఫిర్యాదులు వచ్చాయి. ఈ విషయం ఉన్నత అధికారులకు తెలిసినా ఎందుకు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు? ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోరా అని ఎంపీపీ హేమలత ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆత్మకూరులోని గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. పని చెయ్యని ప్రింటర్లు, యూపీఎస్‌లను పరిశీలించారు. జిల్లా స్థాయి ఉన్నత అధికారులు స్పందించి మండలంలోని గ్రామ సచివాలయాల్లో పని చెయ్యని ప్రింటర్లు, యూపీఎస్‌లకు మరమ్మతులు చేయించాలన్నారు.

అలరించిన అక్కినేని మధుర గీతాలు

అనంతపురం కల్చరల్: అనంత్ నాగ్ సంగీత్ స్వర్గ్ కల్చరల్ అసోసియేషన్ వారు నాగినీ ప్రసాద్ ఆధ్వర్యంలో సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు 101వ జయంతిని నిర్వహించారు. శుక్రవారం రాత్రి స్థానిక కృష్ణకళామందిరంలో జరిగిన సంగీత విభావరిలో జిల్లా వ్యాప్తంగా విచ్చేసిన కళాకారులు అక్కినేనికి గీతాలతో స్వర నీరాజనాలర్పించారు. కార్యక్రమంలో ప్రసాద్, భువన్, జాఫర్, ఆదినారాయణ, శ్రీదేవి, విజయలక్ష్మి, నంజుడప్ప, సినీ, బుల్లితెర నటుడు రమేష్ నీల్, ఘంటసాల ఆరాధన సమితి నిర్వాహకులు రామయ్య, సుగుమంచి సురేష్, శ్రీనివాసులు, భరత్ పాల్గొన్నారు.

పట్టాలపై యువకుడి మృతదేహం

అనంతపురం సిటీ: స్థానిక జీఆర్పీ పరిధిలోని తాటిచెర్ల-గార్లదిన్నె మార్గంలో పట్టాలపై ఓ యువకుడి(30) మృతదేహాన్ని శుక్రవారం గుర్తించినట్లు జీఆర్పీ ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. గుర్తు తెలియని యువకుడు జీవితంపై విరక్తితో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని అనుమానాలు వ్యక్తం చేశారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. వ్యక్తి అదృశ్యం కేసుల్లో సంబంధీకులు ఎవరైనా ఉంటే అనంతపురం రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

బాధిత కుటుంబాలకు బీమా చెక్కుల అందజేత



రాధాబాయికి చెక్కు అందిస్తున్న ఉరవకొండ డీఎం బాలాజీ దయాళ్

ఉరవకొండ: ఉరవకొండ ఆర్టీసీ డిపో పరిధిలో పనిచేస్తూ మృతి చెందిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్-3 ఆర్‌వీకే రావు కుటుంబానికి ఎంప్లాయీస్ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ స్కీమ్ కింద మంజూరయిన రూ.7,00100 చెక్కును డీఎం బాలాజీ దయాళ్ అందించారు. శుక్రవారం స్థానికి డిపో కార్యాలయంలో బాధితురాలు రాధాబాయికి చెక్కును అందించారు. అదేవిధంగా హెచ్ఎస్ స్వామి (కండక్టర్) కుటుంబానికి రూ.5,66,889, డీటీ స్వామి (డ్రైవర్) కుటుంబాలకు రూ. 2,89,000 మంజూరయ్యింది. హెడ్‌క్లర్క్ రవి, సీనియర్ అసిస్టెంట్ కైలాష్ పాల్గొన్నారు.

మహిళల భద్రతపై అవగాహన

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం మహిళల భద్రత, చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి, మహిళా సాధికారత విభాగం కన్వీనర్ నాజ్మాబేగం, లావణ్య, నాగలక్ష్మి పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించం



నగరంలో పర్యటిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: పారిశుధ్యం మెరుగులో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని నగరపాలక సంస్థ కార్యదర్శులు, సిబ్బందిని మేయర్ వసీం హెచ్చరించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్ నాగరాజుతో కలసి 41, 42, 43, 46, 50వ డివిజన్లలో మేయర్ పర్యటించారు. పలు డివిజన్లలో చెత్తను తొలగించకపోవడం, డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో చెత్తా చెదారాన్ని తరలించకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ఎప్పటికప్పుడు ట్రాక్టర్ల ద్వారా చెత్తను తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్లాప్ ఆటోలు వెళ్లలేని ప్రాంతాలకు ప్రత్యామ్నాయ మార్గాలను చూడాలన్నారు. కార్పొరేటర్లు శేఖర్ బాబు, ఇసాక్, రహంతుల్లా, కమల్ భూషణ్, నాయకులు రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దృఢ సంకల్పమే జీవితానికి పునాది



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ

అనంతపురం ఎడ్యుకేషన్: దృఢ సంకల్పమే జీవితానికి పునాది.. అలాంటి సంకల్పం మనిషిని అందనంత ఎత్తుకు ఎదిగేలా చేస్తుందని జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ బాలుర ఐటీఐ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. ఒకసారి ఉద్యోగం రాకపోయినా సంకల్పంతో ప్రయత్నిస్తే కచ్చితంగా గమ్యం చేరుకుంటారన్నారు. ఆన్‌సెట్ సీఈఓ అరుణకుమారి మాట్లాడుతూ.. పరిశ్రమలన్నీ నైపుణ్యాలు ఉన్న వారి కోసం ఎదురుచూస్తున్నాయన్నారు. వివిధ ఉద్యోగాలకు 171 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి, జాబ్ జిల్లా మేనేజర్ సూర్యనారాయణ, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ ఆనంద్ రాజ్‌కుమార్, ఐటీఐ అప్రెంటిషిప్ సలహాదారు ప్రసాద్ పాల్గొన్నారు.

గొరిదిండ్ల తండాలో పారిశుధ్య పనులు



మురుగును తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూరు: మండలంలోని గొరిదిండ్ల తండాలో మురుగు రోడ్లపై ప్రవహించడంతో విష జ్వరాలు వ్యాపిస్తున్నాయని ఈనెల 17వ తేదీన సాక్షి దినపత్రికలో కథనం వెలువడింది. స్పందించిన అధికారులు శుక్రవారం గ్రామంలో పర్యటించారు. మురుగు నిల్వ ఉన్న ప్రాంతాలను శుభ్రం చేశారు. అపరిశుభ్రత నెలకొన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయించారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం తొలగించి శుభ్రం చేయించారు. కార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీ మహమ్మద్ రఫీ, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.